క్లుప్తంగా

ఆసుపత్రికి సిమెంట్ బెంచీల విరాళం అభినందనీయం



సిమెంట్ బెంచీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(హాస్పిటల్): ఎంతో మంది పేద రోగులు వచ్చే ప్రభుత్వాసుపత్రికి జనవిజ్ఞాన వేదిక వారు సిమెంట్ బెంచీలు విరాళంగా ఇవ్వడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన చెప్పారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు విరాళంగా అందజేసిన సిమెంట్ బెంచీలను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు సిమెంట్ బెంచీలు సేదతీరుస్తాయన్నారు. ఇందుకు సహకరించిన ప్రజాసంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రూ.1.60 లక్షల వ్యయంతో 50 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్ రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత



కిట్లను అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): పిల్లల్లో మానసిక ఉల్లాసాన్ని పెంచేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడుతామని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో తైక్వాండో, కరాటే విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన కిట్లను అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. పిల్లలకు కేవలం చదువుతో సరిపెట్టకుండా వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఆట, పాటలు, ఇతర క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. కిట్లు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి రమణ, పార్టీ నాయకు నయీం పాషా, ప్రభుదాస్, గఫర్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

కర్నూలు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సీఐ కె.శ్రీరామ్ అన్నారు. కర్నూలు అర్బన్ తాలూకా సీఐ రామలింగమయ్యను వీఆర్‌కు బదిలీ చేసి ఆ స్థానంలో శ్రీరామ్‌ను నియమించడంతో గురువారం ఉదయంఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎవరికి అన్యాయం జరిగినా స్టేషన్‌ను ఆశ్రయించవచ్చునని, వ్యక్తిగతంగా గొడవలు పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వి.ధంగా వ్యవహరిస్తే కౌంటర్ కేసులు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలను ఎటువంటి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని, అలాంటి వారు వాటికి స్వస్తి పలికి గౌరవప్రదమైన జీవనం సాగించాలని సూచించారు. ఎవరికి అన్యాయం జరిగినా స్టేషన్‌లో బాధితులకు న్యాయం జరుగుతుంద న్న భరోసా కల్పించేందుకు ప్రయత్నిస్తానన్నారు.

పీహెచ్‌సీల్లో కాన్పులు



ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

కల్లూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య వైద్యాధికారులకు ఆదేశించారు. గురువారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మా ట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులను గుర్తించి ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఏఎన్ఎంలు ప్రతి రోజు 10 హెల్త్ ఐడీ జనరేట్ చేయలన్నారు. ఎన్‌సీడీ సర్వేను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద రావు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన మున్సిపల్ టీచర్లు

కర్నూలు సిటీ: మున్సిపల్ స్కూళ్ల ఉపాధ్యాయులు గురువారం డీఈఓ రంగారెడ్డిని ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో మున్సిపల్ స్కూళ్లలో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఆ ఫెడరేషన్ నాయకులు వెంకటరెడ్డి, రాముడు, మురళీ, నిర్మల్‌కుమార్ ఉన్నారు.

దిగొచ్చిన చంద్రులు!







కర్నూలు నగరం సరికొత్త శోభను సంతరించుకుంటోంది.గతంలో ఎప్పుడూ లేని విధంగా సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితమే గుత్తి పెట్రోల్ బంకు దగ్గర పెద్ద నమూన గ్లోబ్‌ను ఏర్పాటు చేసి నగరానికి ప్రపంచ స్థాయి శోభను తీసుకొచ్చారు. తాజాగా జీ- 20 సదస్సు సందర్భంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మాదిరిగానే స్థానిక రాజ్‌విహార్ కూడలిలో నగరపాలక రూ. 10 లక్షలతో సుందరీకరణ పనులు చేపట్టి పెద్ద ఎత్తున లైటింగ్ సిస్టమ్, కుందేళ్ల బొమ్మలు ఏర్పాటు చేసింది. రాత్రిపూట జిగేల్ మంటున్న ఈ కాంతులు నగరవాసులను విశేషంగా ఆకటుకుంటున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ప్రధానోపాధ్యాయులు స్పందించకుంటే కఠిన చర్యలు

కర్నూలు సిటీ: పాఠశాలలు పునఃప్రారంభం నాటికి జగనన్న గోరుముద్దకు సంబంధించినవి సిద్ధంగా ఉంచుకోవాలని మధ్యాహ్న భోజన పథకం ఏడీ శ్యామూల్ పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టేందుకు బియ్యం, కోడి గుడ్లు, చిక్కీలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దీంతో పాటు రాగి పిండి, బెల్లం, గ్లాసులు తీసుకెళ్లే విషయంలో డీఈఓ ఆఫీస్ నుంచి సిబ్బంది ఫోన్లు చేస్తున్నా హెచ్ఎంలు స్పందించడం లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల విద్యాధికారులు కూడా పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటివరకు కేవలం బియ్యం 14.78 శాతం, రాగి పండి 12.96 శాతం మాత్రమే స్కూళ్లకు తీసుకెళ్లినట్లు తెలిపారు.

అవ్వా.. పింఛన్ వస్తుందా?



వృద్ధురాలితో మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): అవ్వా.. మీకు పింఛన్ వస్తుందా.. ఏమైనా ఇబ్బంది ఉందా? అని వృద్ధురాలు సుబ్బలక్ష్మమ్మను కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అడిగారు. గురువారం సాయంత్రం అయన స్థానిక 3వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధురాలిని పలకరించగా ఆమె సంతోషం వ్యక్తం చేస్తూ తనకు ప్రతి నెలా ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇస్తున్నారని, గతంలో మాదిరిగా ఆఫీసుల చుట్టూ తిరిగే బాధ తప్పిందని చెప్పారు. అనంతరం ఆయన కార్యక్రమంలో భాగంగా పూల బజార్, సేట్‌కి గల్లీ, సాగ్ మండి తదితర ప్రాంతాల్లోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్ అందజేశారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు నుంచి వాహనాల రాకపోకలు పెరిగాయి. దీంతో అక్కడ ట్రాఫిక్‌ను, ప్రమాదాలను నియంత్రించేందుకు నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం చర్యలు చేపట్టింది. గురువారం టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు శబరీష్, హరీష్ చౌదరి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, జాతీయ రహదారుల విభాగం, ట్రాఫిక్, రహదారులు, భవనాల శాఖ అధికారులు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల బృందం ఆయా ప్రాంతాలను పరిశీలించింది. నంద్యాల చెక్‌పోస్టు నుంచి సఫా ఇంజనీరింగ్ కళాశాల వరకు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే రాజ్ విహార్ సెంటర్ సమీపంలో డివైడర్లను మార్పు చేయాలని, బళ్లారి చౌరస్తా వద్ద అండర్ పాస్ ఏర్పాటుపై నేషనల్ హైవే అధికారులతో కలిసి మరోసారి సమావేశంలో చర్చించాలని నిర్ణయించినట్లు కర్నూలు టౌన్ ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.



నంద్యాల చెక్‌పోస్టు వద్ద డివైడర్ల ఏర్పాటుపై చర్చిస్తున్న అధికారులు

అవీ-ఇవీ

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయండి

కర్నూలు(అర్బన్): కర్నూలు జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప కోరారు. గురువారం ఆయన విజయవాడలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతిలాల్‌దండేను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు ఏకలవ్య మోడల్ స్కూల్ మంజూరైనా, స్థల సేకరణ పేరుతో రెండు సంవత్సరాలుగా కాలయాపన జరుగుతోందన్నారు. పలుమార్లు జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పలు నియోజకవర్గాల్లో పర్యటించి స్థలాలను అన్వేషించారని, అయితే పాఠశాల ఏర్పాటుకు ఇంత వరకు స్థలాన్ని గుర్తించలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ విద్యా సంవత్సరంలోనే స్కూల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పాఠశాల ఏర్పాటైతే గిరిజన వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు దోహదపడిన వారవుతారన్నారు.

26 వాహనాలు స్వాధీనం

కర్నూలు సిటీ: ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో గురువారం రాత్రి నగరంలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. సుంకేసుల రోడ్డులోని సంజీవిని హాస్పిటల్ దగ్గర నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 26 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

క్రైం కార్నర్

మద్యం విక్రయదారుల అరెస్టు

కర్నూలు : కర్నూలు బుధవారపేటకు చెందిన దరూరు ప్రసాద్, బోయ మధులను మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. బుధవారపేటలోని శ్మశానం రోడ్డులో తెలంగాణ మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ మురళీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు నిఘా వేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద పది తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి ..

పాణ్యం: రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల కేంద్రం రైల్వే స్టేషన్‌లో గురువారం ఈ ఘటన జరిగింది. మృతుడు ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లెకు చెందిన కె. వీరయ్య(25)గా రైల్వే పోలీసులు గుర్తించారు. ప్రమాదంపై గుంటూరు ప్యాసింజర్ రైలు పైలెట్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్ఐ అబ్దుల్ జలీల్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. లభించిన ఆధారాల ద్వారా కుటుంబ సభ్యులకు ఆయన సమాచారం ఇచ్చారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన సుభాషిణితో మృతుడికి వివాహమైంది. వీరికి ఓ కుమార్తె సంతానం. అయితే, భార్యాభర్తల మధ్య మనస్పర్థలే ఈ ఆత్మహత్యకు కారణమని తెలుస్తోందని రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దేశానికే ఆదర్శం వలంటీర్ వ్యవస్థ

- సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాల ప్రదానోత్సవం
- కర్నూలు నగర పరిధిలో వలంటీర్లకు ఘన సత్కారం
- కర్నూలు ఎమ్మెల్యే, మేయర్ వెల్లడి



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం స్థానిక 1 వ వార్డు నాగమయ్య కట్ట వివేకానంద పాఠశాల మైదానంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేవలం గౌరవ వేతనంతో ఇటు ప్రజలు, అటు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి సేవలందిస్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. అనంతరం కర్నూలు నియోజకవర్గంలోని 1 వ వార్డు నుంచి 6 వ వార్డు వరకు ఉన్న 1 నుంచి 17 సచివాలయాల వలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న, సేవావజ్ర పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఐదుగురికి సేవా వజ్ర అవార్డులు అందించారు. కార్యక్రమంలో మెప్మా టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకట లక్ష్మి, కోఆప్షన్ మెంబర్ నయీమ్ పాషా, కార్పొరేటర్లు షాషావలి, షాజహాన్ పర్వీన్, అర్షియా పర్వీన్ నీలోఫర్, వక్ఫ్‌బోర్డు మెంబర్ ఫిరోజ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సోహెయిల్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ చెస్ కోచ్ రమేష్ మృతి



కర్నూలు(రూరల్): సీనియర్ చెస్ కోచ్ ఎస్.రమేష్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం కోలుకోలేక మృతిచెందాడు. ఈయన కర్నూలు నగరం బాలాజీ నగర్‌లో నివాసముంటారు. దాదాపు మూడు దశాబ్దాలుగా వివిధ విద్యా సంస్థల్లో చెస్ కోచ్‌గా పనిచేసి పలువురిని రాష్ట్ర, జాతీయ స్థాయి చెస్ క్రీడాకారులుగా తీర్చిదిద్దారు.

13 నుంచి రైతు శిక్షణ తరగతులు

కర్నూలు(రూరల్):ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు గుంటూరు జిల్లా నరసరావు పేటలో రాష్ట్రస్థాయి రైతు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లుఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె. జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ శిక్షణ తరగతులకు ఏఐకేఎస్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు రావుల వెంకయ్య,అతుల్ కుమార్ హాజరవుతారన్నారు.రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారన్నారు.జిల్లా నలుమూలల నుంచి రైతులు హాజరై శిక్షణ జయప్రదం చేయాలన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు సిటీ: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని జిల్లా గ్రంథాయల సంస్థ అధ్యక్షుడు మద్దురూ సుభాష్ చంద్రబోస్ అన్నారు. నగరంలోని జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం తరగతుల్లో భాగంగా నిర్వహించిన సమ్మర్ క్యాంపు గురువారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు జీస్ మహేష్ బాబు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు నెల రోజుల పాటు సమ్మర్ క్యాంప్‌లో వివిధ అంశాలపై అవగాహన పెంచుకున్నారన్నారు. గ్రంథాయలయంపై అవగాహన పెంచుకోవడంతో పాటు కుట్లు, అల్లికలు నేర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు టీడీ ఉసేన్‌పీరా, రిటైర్డ్ లెక్చరర్ సుధాకర్, హనుమంతప్ప, యాంగటేశ్వరప్ప, సంగీత మాస్టర్ మల్లీశ్వరి, వెంకటేశ్వరరెడ్డి, తేజేశ్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు కె.జి గంగధర్ రెడ్డి, నిఖిలేష్, స్వచ్ఛంద సమితి అధ్యక్షుడు మద్దిలేటి, సంస్థ కార్యదర్శి ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ప్రతిష్టను దిగజార్చొద్దు

కర్నూలు(న్యూసిటీ): అసత్య కథనాలతో రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రతిష్టను దిగజార్చేవిధంగా వ్యవహరించొద్దని వైస్ చాన్స్‌లర్ ఎ.ఆనందరావు అన్నారు. ఇటీవల వివిధ పత్రికల్లో (సాక్షి కాదు) వచ్చిన కథనాలను ఆయన ఖండించారు. ఆర్థికశాఖతోపాటు పాలకమండలి అనుమతుల్లేకుండా ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి వర్సిటీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ప్రచురించిన కథనాల్లో వాస్తవం లేదన్నారు. ఇంకోసారి వాస్తవాలు తెలుసుకోకుండా వర్సిటీపై బురదజల్లే ప్రయత్నాలు చేయొద్దని హితవు పలికారు.

జలవనరుల శాఖలో బదిలీలు

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ పరిధిలోని ఈఈలు, డీఈఈలు బదిలీ అయ్యారు. తెలుగుగంగా నంద్యాల డివిజన్ ఈఈగా పని చేస్తున్న చిన్న కొండారెడ్డి అబ్బవరం ఎస్ఆర్‌బీసీ క్వాలిటీ కంట్రోల్-1 ఈఈగాను, ఎస్ఆర్‌బీసీ క్వాలిటీ కంట్రోల్ డివిజన్-2 నుంచి తెలుగుగంగా నంద్యాల ఈఈగా బదిలీ అయ్యారు. అదే విధంగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులర్ ఈఈగా పని చేస్తున్న మనోహర్ రాజు శ్రీశైలం ప్రాజెక్టు ఈఈగాను, ఏలూరు సర్కిల్ భీమవరం డ్రైనేజీ డివిజన్ నుంచి ఎస్ఆర్‌బీసీ క్వాలిటీ కంట్రోల్ ఈఈగా పి.నాగార్జున రావు బదిలీపై వచ్చారు. ఎస్ఆర్‌బీసీలో డీఈఈగా పని చేస్తున్న రఘురామిరెడ్డి కేసీ కెనాల్ కర్నూలు డివిజన్ డీఈఈగాను, గురురాఘవేంద్ర డివిజన్-2లో పని చేస్తున్న కె.వెంకటేశ్వర్లును శ్రీకాకుళం సర్కిల్ ఆఫీస్‌కు, శింగరాయచెరువు మురళీ గురురాఘవేంద్ర-2 నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి డివిజన్-8(అనంతపురం, పెనుకొండ)కి బదిలీ అయ్యారు.

కర్నూలు పెద్దాసుపత్రిలో..

కర్నూలు (హాస్పిటల్) : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా గురువారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వైద్యులు ఇతర కళాశాలలకు బదిలీ అయ్యారు. వీరిలో మైక్రో బయాలజీ నుంచి డాక్టర్ ఉమాదేవి, ఈఎన్‌టీ నుంచి డాక్టర్ శాంతి, పెథాలజీ నుంచి డాక్టర్ అనితారాణి అనంతపురంకు, సైకియాట్రి విభాగం నుంచి డాక్టర్ ఇక్రముల్లా కడపకు, డాక్టర్ అఫ్సా హస్రార్ నెల్లూరుకు బదిలీ అయ్యారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఉద్యానవన అధికారి నాగరాజు



నర్సరీ లైసెన్స్‌లు పొందిన రైతులతో ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు

పాణ్యం: ఉద్యానవన బోర్డు నుంచి రైతులకు అనేక రాయితీలు ఉన్నాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి నాగరాజు అన్నారు. గురువారం పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పాణ్యంలోని నర్సరీ రైతులతో సమావేశం నిర్వహించి లైసెన్స్‌లు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా మొక్కలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన మొక్కలను సరఫరా చేయాలన్నారు. లైసెన్స్ తీసుకున్న ప్రతి రైతు మూడేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది జిల్లాలో 2 వేల హెక్టార్లలో ఉద్యాన తోటల సాగుకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. 15-18 ఏళ్ల పూర్తి చేసుకున్న మామిడి చెట్ల నిర్వహణకు హార్టికల్చర్ బోర్డు అనేక రాయితీలు అందిస్తుందన్నారు. మామిడి ఎగుమతులకు అవకాశం కల్పించాలని రైతులు కోరగా ఎంపీఓఎస్‌లో సభ్యులుగా చేరితే రైతు వద్దకే ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి పంటను కొని ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తారన్నారు. డోన్ నియోజకవర్గంలో ఎగుమతుల కోసం రూ.50 కోట్లతో స్టోరేజీని నిర్మిస్తున్నామన్నారు. కొత్తగా కొబ్బరి సాగు చేసుకునే వారికి రాయితీ అందిస్తున్నామని, ఆయా గ్రామ హార్టికల్చర్ అధికారి వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద చామంతి మొక్కలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కొత్తగా నర్సరీ లైసెన్స్ పొందిన రైతులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సుబ్రమణ్యం, ఉద్యావన అధికారి దివ్య, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, బాబు, ప్రశాంత్‌కుమార్, చంద్రకళ, యామిని, నర్సరీల రైతులు పాల్గొన్నారు.